హత్య కేసులో నిందితుల అరెస్ట్



2



2

గంజాయి విక్రయిస్తే భారీ జరిమానా..



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## కాలభైరవుని సేవలో డీసీసీ అధ్యక్షుడు



**అక్షరటుడే, కామారెడ్డి:** రామారెడ్డి ఇసన్నపల్లి కాలభైరవుడి ఆలయంలో డీసీసీ అధ్యక్షుడు ఏలె మల్లికార్జున్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు డీసీసీ అధ్యక్షుడికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు దంపతులను సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.





## కామారెడ్డి కళాశాల పీజీ ఫలితాల విడుదల

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి ప్రభుత్వ కళాశాలలో పీజీ ప్రథమ, తృతీయ సెమిస్టర్ ఫలితాలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.విజయ్ కుమార్ శుక్రవారం వెల్లడించారు. తెలంగాణ విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను అభినందించారు.

### 90 శాతానికి పైగా ఉత్తీర్ణత..

సెమిస్టర్ ఫలితాల్లో కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. దాదాపు అన్ని విభాగాల్లో 90 శాతానికి పైగా ఉత్తీర్ణత నమోదు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. అధ్యాపకుల కృషి, విద్యార్థుల పట్టుదల వల్లే ఉత్తమ ఫలితాలు సాధ్యమయ్యాయని, భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగించి కళాశాలకు మరింత గుర్తింపు తీసుకురావాలని సూచించా రు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కిష్టయ్య, తెలంగాణ విశ్వవిద్యాలయ అదనపు పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ సంపత్, కళాశాల పరీక్షా విభాగం అధికారులు రాములు, రాజేందర్ పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం ఊరట కలిగించే వార్త చెప్పింది. బిల్లుల చెల్లింపుల నిబంధనలను సడలించింది. దీంతో మొత్తం పనులు కాకున్నా తుది బిల్లు మంజూరు కానుంది. గతంలో వైరింగ్, ఫ్లోరింగ్, ప్లాస్టరింగ్ వంటి అన్ని పనులు పూర్తయితేనే తుది బిల్లు జారీ చేస్తామని ప్రభుత్వం చెప్పింది. తాజాగా ఆ నిబంధనలను సడలించింది. దీంతో జిల్లాలో 700 మందికి పైగా లబ్ధిదారులకు తక్షణమే బిల్లులు రానున్నాయి.

\- అక్షరటుడే, భీమ్‌గల్

# ‘ఇందిరమ్మ’ లబ్ధిదారులకు ఊరట

■ బిల్లుల చెల్లింపు నిబంధనల సడలింపు ■ ఇక ఆ పనులు కాకున్నా పూర్తి బిల్లు ■ వేగవంతం కానున్న ఇళ్ల నిర్మాణం

రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. తొలిదశలో పలువురికి ఇళ్లను మంజూరు చేసింది. జిల్లాలో పలువురు లబ్ధిదారులు వేగంగా పనులు కొనసాగిస్తున్నారు. ఇంటి నిర్మాణ దశల వారీగా ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తోంది. బేస్‌మెంట్, గోడలు, స్లాబ్, మొత్తం నిర్మాణం పూర్తయ్యాక విడతల వారీగా డబ్బులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తోంది. జిల్లాలో కొన్ని ఇళ్లు స్లాబ్ లెవల్ వరకు పూర్తయ్యాయి.

| జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల వివరాలు | |
|---|---|
| మొత్తం మంజూరైన ఇళ్లు : | 17,122 |
| ప్రారంభమైనవి : | 13,848 |
| బేస్మెంట్ దశలో : | 11,110 |
| రూఫ్ లెవెల్‌లో : | 8,728 |
| స్లాబ్ దశలో : | 7,226 |
| నిర్మాణం పూర్తయినవి : | 1,581 |

### ఆర్థిక పరిస్థితి బాగాలేక..

ఇంటి ప్లాస్టరింగ్, వైరింగ్, ప్లంబింగ్ ఫ్లోరింగ్, రంగులు వేయడానికి భారీగా ఖర్చు అవుతుంది. దీంతో ఆర్థిక పరిస్థితి బాగా లేని వారు స్లాబ్ పూర్తయ్యాక ఇంట్లోకి వెళ్లి.. తర్వాత పనులు చేసుకుంటారు. డబ్బులు ఉన్నప్పుడు మిగతా పనులు చేయించాలని అనుకుంటున్నారు. అయితే ఇందిరమ్మ ఇళ్ల తుది బిల్లు రావాలంటే అన్ని పనులు పూర్తి కావాలనే నిబంధన గతంలో ఉండేది. దీంతో చాలా మందికి బిల్లులు నిలిచిపోయాయి. తాజాగా ప్రభుత్వం ఆ నిబంధనల్లో సడలింపు ఇచ్చింది.

### సడలించిన నిబంధనలు

ప్రస్తుతం ఇంటి బయట గోడలకు ప్లాస్టరింగ్ పూర్తయి, లోపల అవసరాన్ని బట్టి చేసుకునే వెసులుబాటు కల్పించారు. లోపల ప్లాస్టరింగ్ చేసుకోకున్నా.. తుది బిల్లులు చెల్లిస్తారు. అయితే బయట మాత్రం ప్లాస్టరింగ్ చేయాలి. అలాగే ఫ్లోరింగ్, వైరింగ్, రంగులు వంటి పనులు పూర్తి కాకపోయినా, నివాసానికి అనుకూలంగా ఉంటే బిల్లు మంజూరు చేస్తారు. ఇంటి ప్రధాన ద్వారానికి తలుపు బిగించి ఉంటే చాలు, లోపలి గదులకు తలుపులు లేకున్నా సరే. నిబంధనల సడలింపుతో జిల్లాలో స్లాబ్ పూర్తి చేసుకుని, చిన్న చిన్న పనుల వల్ల బిల్లులు ఆగిపోయిన సుమారు 700 మందికి పైగా లబ్ధిదారులకు మేలు జరగనుంది.

### నివాసయోగ్యంగా ఉంటే చాలు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా నిబంధనల సడలింపు లబ్ధిదారులకు ఒక గొప్ప అవకాశం. గతంలో చిన్న చిన్న ఫినిషింగ్ పనులు పెండింగ్‌లో ఉండడంతో తుది బిల్లులు ఆగిపోయి లబ్ధిదారులు ఇబ్బంది పడేవారు. కానీ ఇప్పుడు ప్రభుత్వం నిబంధనలు సడలించింది. ఇల్లు నివాసయోగ్యంగా ఉంటే చాలు తుది బిల్లులను మంజూరు చేస్తున్నాం. జిల్లాలో ప్రస్తుతం 13,848 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి.

\- గంగాధర్, హౌసింగ్ పీడీ, నిజామాబాద్



## జీజీహెచ్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా నాగమోహన్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లా జనరల్ ఆస్పత్రి నిజామాబాద్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ నాగమోహన్ నియమితులయ్యారు. ఈ మేరకు డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల/ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఫోరెన్సిక్ మెడిసిన్ ప్రొఫెసర్, విభాగాధిపతిగా డాక్టర్ నాగమోహన్ సేవలందిస్తున్నారు. ఆయనకు తాజాగా జీజీహెచ్ ఇన్‌ఛార్జ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఆ స్థానంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ పి శ్రీనివాస్ పిడియాట్రిక్ హెచ్‌వోడీగా కొనసాగనున్నారు. ఈ మేరకు డీఎంఈ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో నాగమోహన్ బాధ్యతలు తీసుకోనున్నారు.



## హోమియోపతిలో అన్ని రకాల వ్యాధులకు చికిత్సలు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** హోమియోపతి ద్వారా అన్ని రకాల వ్యాధులకు చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, ప్రతిఒక్కరూ ఈ సేవలను వినియోగించుకోవాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ అన్నారు. ప్రపంచ హోమియో దినోత్సవం సందర్భంగా నగరంలోని పద్మశాలి సంఘం 10వ తర్ప భవనంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి డీఎంహెచ్‌వో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శిబిరానికి పెద్ద సంఖ్యలో ప్రజలు రావడం పై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయుష్ విభాగం ఇన్‌ఛార్జి గంగాదాస్ మాట్లాడుతూ హోమియోలో అన్నిరకాల రోగాలకు చికిత్స ఉంటుందన్నారు. హోమియోపతి సీనియర్ వైద్యులు శ్రీవాణి మాట్లాడుతూ డాక్టర్ శామ్యూల్ గురించి వివరించారు. కార్యక్రమంలో సుమారు 423 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఔషధాలు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చింతకాయల రాజేందర్, పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు, ఆయుష్ వైద్యులు, ఆయుష్ విభాగం ఫార్మసిస్టులు న్యావానంది పురుషోత్తం, ఉమాప్రసాద్, సబియా, వరలక్ష్మి, ఆయుష్ పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు. శిబిరంలో ఔషధ మొక్కల ప్రదర్శన ఏర్పాటుచేశారు. శిబిరంలో యునానీ సీనియర్ వైద్యులు ఫసియుద్దీన్, ఆయుష్ వైద్యులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల నిర్వహణ తీరు మెరుగుపడాలి

**అక్షరటుడే, ఆర్మూర్ :** సెల్‌ఫోన్లను సద్వినియోగం చేసుకొని అంగన్‌వాడీల నిర్వహణ తీరును మెరుగుపర్చుకోవాలని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి సూచించారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో ఆర్మూర్ నియోజకవర్గంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు సెల్‌ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన సెల్‌ఫోన్లను అంగన్‌వాడీ టీచర్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్మూర్ టీడీపీవో భార్గవి, అంగన్‌వాడీ టీచర్ల ప్రాజెక్ట్ అధ్యక్షురాలు చంద్రకళ, తార తదితరులు పాల్గొన్నారు.







## కిరాయి మూకలతో బీజేపీ చేస్తున్న దాడులు సరైనవి కావు: బొబ్బిలి రామకృష్ణ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** బీజేపీ చేస్తున్న అక్రమ వసూళ్లను బయటపెట్టినందుకు కిరాయి మూకలతో దాడులకు పాల్పడడం సరైంది కాదని కాంగ్రెస్ పార్టీ నగరాధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ వ్యాఖ్యానించారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. 8వ డివిజన్‌లో అక్రమాలకు పాల్పడుతున్నాడంటూ కార్పొరేటర్‌పై కేసు నమోదైన విషయం మరవక ముందే అదే డివిజన్ నుంచి కాంగ్రెస్ తరఫున కార్పొరేటర్ అభ్యర్థిగా నిలబడిన జిల్లాల రమేశ్‌పై శుక్రవారం దాడి జరిగిందన్నారు. ప్రజల ముందుకు నిజాలను తీసుకువస్తే, వాటికి సమాధానం చెప్పలేక భయపడి ఇలాంటి దౌర్జన్యాలకు దిగుతున్నారని ఆయన ఆరోపించారు. జిల్లాల రమేష్‌పై జరిగిన దాడి ప్రజాస్వామ్యానికి తీవ్ర అవమానమని వ్యాఖ్యానించారు. ఇలాంటి దాడులను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ దాడిలో నిజానిజాలను బయటపెట్టి దోషులను కఠినంగా శిక్షించాలని పోలీస్‌శాఖను కోరారు.

## సర్వీస్ రూల్స్‌తో పాటు కన్వర్షన్ ఇవ్వాలి.. విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల డిమాండ్

**అక్షరటుడే, కామారెడ్డి:** విద్యుత్ శాఖ లో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులకు ఏఈపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్‌తో పాటు కన్వర్షన్ ఇవ్వాలని ఆర్టిజన్ కార్మికులు డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో కామారెడ్డి విద్యుత్ కార్యాలయం వద్ద ఆర్టిజన్ కార్మికులు చేపట్టిన సమ్మె మూడో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్‌మ్యాన్డ్ కార్మికులను టీజీఎస్పీడీసీఎల్ కంపెనీ తరహాలో ఆర్టిజన్ కార్మికులుగా గుర్తించాలన్నారు. పీస్‌రేట్ వర్క్‌లకు జీవో 11 ప్రకారం వేతనాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సమ్మెలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కన్వీనర్ హరికృష్ణ, కామారెడ్డి జిల్లా జేఏసీ కో ఛైర్మన్ బెమ్రాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కిష్టాగౌడ్, కామారెడ్డి జిల్లా జేఏసీ కన్వీనర్ జయసింహారెడ్డి, కామారెడ్డి డివిజన్ జేఏసీ ఛైర్మన్ సునీల్ గౌడ్, కన్వీనర్ రంజిత్ యాదవ్, స్వామి, సీఎల్ అన్‌మ్యాన్డ్ కార్మికులు రవి, నితిన్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.









## క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నిజామాబాద్ ప్రీమియర్ లీగ్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జిల్లా కేంద్రంలో నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో ‘నిజామాబాద్ ప్రీమియర్ లీగ్’ నిర్వహిస్తున్నట్లు సీపీ సాయిచైతన్య తెలిపారు. ఈ మేరకు సీపీ కార్యాలయంలో శుక్రవారం లీగ్‌కు సంబంధించిన పోస్టర్, టీ షర్ట్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత పెడదోవ పట్టకుండా ఉండేందుకు క్రీడాపోటీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. జిల్లాస్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ టోర్నీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా యువకులు, ప్రజలకు సైబర్ సెక్యూరిటీ, మాదక ద్రవ్యాల నిర్మూలన ట్రాఫిక్ నిబంధనల పై విస్తృత అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. నిర్వహణ కమిటీలో ఎన్ఎస్‌సీ ఛైర్మన్‌గా సాయి చైతన్య, కన్వీనర్‌గా బస్వారెడ్డి, జనరల్ సెక్రెటరీ కవితా రెడ్డి వ్యవహరిస్తారన్నారు. కమిటీలో జాయింట్ సెక్రెటరీలుగా శ్రీనివాస్ రెడ్డి (స్పోర్ట్స్), డాక్టర్ శిరీష్ కుమార్ (సైబర్ సెక్యూరిటీ), రజినీకాంత్ (ఫిజికల్ సెక్యూరిటీ), ట్రెజరర్‌గా సంతోష్ కుమార్ బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపారు. పోటీల్లో పాల్గొనాలనుకునే వారు 11వ తేదీ నుంచి 17వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలి. పోటీలకు సంబంధించిన డ్రా 18వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు తీయనున్నారు. ఈ టోర్నమెంట్ కేవలం నిజామాబాద్ జిల్లా నివాసులకు మాత్రమే అవకాశం ఉంది. టోర్నమెంట్ సమన్వయకర్తలుగా జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ బి.పవన్ కుమార్ (9701177144) కబడ్డీ కోచ్ ప్రశాంత్ బాధ్యతలు చేపట్టారు. పేర్ల నమోదు కోసం వాలీబాల్ బి.మల్లేష్ గౌడ్ (9440711635), బాస్కెట్ బాల్ బి.నరేష్ (9440404424), కబడ్డీ ఎం.ప్రశాంత్ (9866770889), యోగా పోటీల్లో పాల్గొనేందుకు సంగీత (9848420803), గంగాధర్ (8074982200)లను సంప్రదించాల్సి ఉంటుంది. అలాగే క్రికెట్ పోటీల కోసం సురేష్ కుమార్ (9849202586), విక్రమ్ (9493309972)లను సంప్రదించాలి.

## రేపు జిల్లాకు ఆర్ఎస్ఎస్ చీఫ్ రాక..

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ శనివారం జిల్లాకు రానున్నారు. రెంజల్ మండలం కందకుర్తిలో ఆయన పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా అధికారులతో కలిసి ఆయన పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. కందకుర్తిలో కొనసాగుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ అధికారులకు సూచనలు చేశారు. మోహన్ భగవత్ పర్యటనలో భద్రతాపరంగా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. బహిరంగ సభకు వచ్చే వారు వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు ఎంపిక చేసిన స్థలంలో ఏర్పాట్లు, సభా ప్రాంగణం, బారికేడ్లు తదితర వాటిని కలెక్టర్ పరిశీలించారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ భద్రతకు పకడ్బందీ బందోబస్తును ఏర్పాటు చేయాలని, ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా ముందస్తుగానే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. సభాస్థలి వద్ద అన్ని వసతులతో కూడిన అంబులెన్స్, అగ్నిమాపక శకటం, వైద్య బృందం అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఏసీపీ శ్రీనివాస్, తహశీల్దార్ శ్రవణ్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.



# భద్రతపై నీలినీడలు..



- జిల్లాలో పెరుగుతున్న పోక్సో కేసులు
- బాలికలను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే..
- పాఠశాలల్లోనూ అవగాహన కార్యక్రమాలు తప్పనిసరి
- కన్నెర్ర చేస్తున్న న్యాయస్థానాలు.. ఒకే నెలలో ముగ్గురికి 20ఏళ్ల జైలు

**జిల్లాలో పోక్సో కేసులు పెరుగుతున్నాయి. బాలికలకు మాయమాటలు చెప్పి అఘాయిత్యాలకు పాల్పడే వారికి న్యాయస్థానం కఠినశిక్షలు అమలు చేస్తోంది. అయినప్పటికీ కొందరి దుశ్చర్యల కారణంగా తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. బాలికలను ఇంటాబయట జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై మరింత పెరిగింది.**

**– అక్షరటుడే, కామారెడ్డి**

కామారెడ్డి జిల్లాలో వేధింపులకు గురైన బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. బాలికలకు అవగాహన కల్పించేందుకు పోలీసులు ప్రత్యేకచర్యలు తీసుకుంటున్నారు. ఎప్పటికపుడు షీ టీమ్స్ అలర్ట్‌గా ఉంటున్నాయి. అయినప్పటికీ జిల్లాలో నమోదవుతున్న పోక్సో కేసులు కలవరపెడుతున్నాయి. పోలీసులు విచారణ చేపట్టి సాక్ష్యాధారాలు కోర్టుకు సమర్పిస్తుండడంతో న్యాయస్థానాలు సైతం పోక్సో కేసులను సీరియస్‌గా పరిగణిస్తున్నాయి. గత మార్చి చివరి వారంలో ముగ్గురు పోక్సో నిందితులకు ఏకంగా 20 ఏళ్ల జైలుశిక్షతో పాటు భారీ జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది.

### పోలీస్‌శాఖ అప్రమత్తం..

ఇటీవల జరిగిన కొన్ని ఘటనల కారణంగా తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇంట్లో బాలికలను ఒంటరిగా వదిలి ఏదైనా పని నిమిత్తం బయటకు వెళ్లాలంటే కూడా భయపడే పరిస్థితులు ఎదురవుతున్నాయని వారు భావిస్తున్నారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పాఠశాలలు, కళాశాలల్లో ఇటీవల అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. షీటీంలు సైతం అప్రమత్తంగా ఉంటున్నారు. ఎవరైనా ఆగంతకులు మాయమాటలు చెప్పి బాలికలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తే ఎలా తప్పించుకోవాలనే విషయాలపై సైతం అవగాహన కల్పిస్తున్నారు.

### న్యాయస్థానాల కన్నెర్ర

జిల్లాలో రోజురోజుకూ పెరిగిపోతున్న పోక్సో కేసులపై కోర్టులు ప్రత్యేక దృష్టి పెట్టాయి. గతనెల మార్చి చివరి వారంలో ముగ్గురు నిందితులకు 20 ఏళ్ల జైలుశిక్ష, భారీగా జరిమానాలు విధిస్తూ సంచలన తీర్పులు వెల్లడించాయి. మూడు కేసుల్లో ముగ్గురికి ఒకేరకమైన శిక్షలు విధించడం జిల్లాలో తీవ్రంగా చర్చకు దారితీసింది. ఇలాంటి శిక్షలతోనైనా మోసగాళ్లలో మార్పు వస్తుందని న్యాయస్థానాలు భావిస్తున్నాయి.

### వారం రోజుల్లో ముగ్గురికి..

గత మార్చి నెలలో 23వ తేదీ నుంచి 30వ తేదీ లోపు ముగ్గురు పోక్సో నిందితులపై న్యాయస్థానం శిక్షలు అమలు చేసింది. 2021 మార్చిలో ఎల్లారెడ్డి మండలంలో ఇంట్లో ఉన్న బాలికపై అత్యాచారానికి పాల్పడ్డ వ్యక్తికి 20ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.15వేలు జరిమానా విధిస్తూ మార్చి 23న తీర్పు వెలువరించింది. 2023 మే నెలలో నిజాంసాగర్ మండలంలో ఆస్తికోసం నమ్మించి బాలికను వివాహం చేసుకుని అఘాయిత్యానికి పాల్పడ్డ వ్యక్తికి 20ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.30వేల జరిమానాను కోర్టు విధించింది. 2025 ఫిబ్రవరిలో ఎల్లారెడ్డి మండలంలో మరో బాలికను మోసం చేసిన వ్యక్తికి 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.15 వేలు జరిమానా విధిస్తూ మార్చి 30న కోర్టు తీర్పునిచ్చింది.

## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి



**అక్షరటుడే, భీమ్‌గల్:** దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని క్రైస్తవ మైనారిటీ రాష్ట్ర నాయకులు మాణిక్యాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పట్టణంలోని చర్చ్ ఆఫ్ ది లివింగ్ గాడ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత క్రైస్తవుల ఎస్సీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పు.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 కల్పించిన మత స్వేచ్ఛను అణచివేసేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కులం పుట్టుకతో వస్తుందని, మతం అనేది వ్యక్తిగత నమ్మకమని పేర్కొన్నారు. సమావేశంలో ఇశ్రాయేల్, కుమార్, నోవా, భాస్కర్, పరంజ్యోతి, జాన్సన్, ప్రభు కృపాకర్, మెతుషెల పాల్గొన్నారు.

## సర్కారీ బడుల్లోనే నాణ్యమైన విద్య



**అక్షరటుడే, భీమ్‌గల్:** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రేకులపల్లి సర్పంచ్ రాజేందర్ అన్నారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఆధ్వర్యంలో శుక్రవారం 'ముందస్తు బడిబాట' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 5 నుంచి 14 ఏళ్ల వయస్సు గల పిల్లల ఇళ్లను సందర్శించి.. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులు, విద్యాబోధనపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం లింగారెడ్డి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం అంకం నరేష్, వార్డు సభ్యులు సత్యనారాయణ, గంగాధర్, కరుణాసాగర్, వనిత, దాసు గౌడ్, ఉపాధ్యాయులు రాము, గంగదాసు, గిరిబాబు, రాణి, రాజలక్ష్మి, శోభ, భాస్కర్ పాల్గొన్నారు.

## ముగిసిన వార్డు సభ్యుల శిక్షణ తరగతులు



**అక్షరటుడే, ముప్కాల్:** మండల కేంద్రంలోని రైతు వేదికలో వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ శిక్షణలో మండలంలోని ఏడు గ్రామ పంచాయతీలకు చెందిన వార్డు సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, ఎంపీవో ముప్కాల్, ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ సభ్యులు, సంబంధిత గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## గంజాయి విక్రయిస్తే జరిమానా.. వేల్పూర్ గ్రామంలో తీర్మానం



**అక్షరటుడే, భీమ్‌గల్(వేల్పూర్):** గ్రామ ప్రజల ఆరోగ్యం, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వేల్పూర్ పంచాయతీ పాలకవర్గం శుక్రవారం మూడు కీలక తీర్మానాలు చేసింది. సర్పంచ్ అశోక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు ఈ నిర్ణయాలు తీసుకున్నారు. గ్రామంలో గంజాయి విక్రయించినా, తాగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయిపై సమాచారం అందించిన వారికి రూ.10 వేల బహుమతి అందజేస్తామన్నారు. అదేవిధంగా, 21ఏళ్ల లోపు యువతకు సిగరెట్లు, గుట్కా, మద్యం విక్రయించే షాప్ యజమానులకు రూ. 10వేల జరిమానా విధించాలని తీర్మానించారు. ఐస్‌క్రీమ్ బండ్లు రాకుండా నిషేధం విధించారు. నిబంధనలు అతిక్రమిస్తే రూ.5వేల జరిమానా తప్పదని స్పష్టం చేశారు. 'మన ఊరుమన బాధ్యత'గా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

## ఘనంగా ఆయుష్ దినోత్సవం



**అక్షరటుడే, బాన్సువాడ:** ప్రజాపాలన ప్రగతి పథకాలు, ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా బాన్సువాడ ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో ఆయుష్ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. స్థానిక యోగా కేంద్రంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయ్ భాస్కర్, యునాని వైద్యశాలకు చెందిన యోగా శిక్షకులు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో శిబిరాన్ని నిర్వహించారు. హోమియోపతి వైద్య విధానం, ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఆయుర్వేదం, యోగా, యునాని, సిద్ధ, హోమియోపతి వంటి ఆయుష్ వైద్య సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం సాధనలను చేయించారు. యోగాను జీవనశైలిలో భాగం చేసుకోవడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయ్ భాస్కర్ మాట్లాడుతూ.. ఆధునిక జీవనశైలితో ఏర్పడుతున్న శారీరక బలహీనతలు, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి ఆయుష్ వైద్య సేవలు, యోగా ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య, విజయ్ భాస్కర్, ఆర్ఎంవో సుజాత, మెడికల్ ఆఫీసర్లు, వైద్యులు, స్టాఫ్ నర్సులు తదితరులు పాల్గొన్నారు.

## వేసవి శిక్షణను పరిశీలించిన స్పెషల్ ఆఫీసర్





**అక్షరటుడే, మోపాల్:** కేజీబీవీ నిజామాబాద్ విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు బోర్గాం(పి)లోని బొటిక్‌లో అప్పరల్స్ విభాగంలో శిక్షణ పొందారు. శిబిరాన్ని కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ దేవినేని సుప్రజ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏయే అంశాల్లో మెలకువలు నేర్చుకున్నారని ఆరా తీశారు. శిక్షణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ తమ విద్యాలయంలో రెగ్యులర్ సబ్జెక్టులతో పాటు ఇతర అంశాల్లోనూ శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఇది విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో వోకేషనల్ ట్రెయినర్ అర్చన, బొటిక్ ట్రెయినర్ నవ్య తదితరులు పాల్గొన్నారు.

## పట్టపగలే ఇల్లు దోచేశారు.. భారీగా బంగారం అపహరణ

**అక్షరటుడే, ఆర్మూర్:** జన సంచారం ఉన్న ప్రాంతాల్లోనే దొంగలు దర్జాగా దోపిడీకి పాల్పడుతుండడం ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. ఆర్మూర్ పట్టణ పరిధిలో పట్టపగలే ఇల్లు దోచేశారు. భారీ ఎత్తున్న బంగారం దోపిడీకి పాల్పడ్డారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ విశాఖ కాలనీలో ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖ కాలనీకి చెందిన వినోద్ కుమార్తెకు త్వరలో వివాహం జరగనుంది. ఈ క్రమంలో గురువారం ఉదయం ఇంటికి తాళం వేసి గ్రామదేవతలకు పూజలు చేయడానికి కుటుంబ సభ్యులతో వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గమనించిన దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడి 14 తులాల బంగారం, రూ.లక్ష నగదు అపహరించారు. గుడికి వెళ్లి ఇంటికి తిరిగి వచ్చేసరికి తలుపులు పగులగొట్టి, ఇల్లంతా చిందరవందరగా ఉండడంతో చోరీ జరిగినట్లు భావించిన కుటుంబ సభ్యులు ఈ విషయమై ఆర్మూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## రోడ్డు ప్రమాదంలో భార్య మృతి.. భర్తకు గాయాలు

**అక్షరటుడే, ఆర్మూర్:** గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొన్న ఘటనలో మహిళ మృతి చెందగా.. ఆమె భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆర్మూర్ పట్టణ శివారులోని బ్రాహ్మణపల్లి ఎక్స్ రోడ్ వద్ద గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గోవింద్ పేటకు చెందిన భార్యాభర్తలు కొత్తూరు నర్సయ్య, కొత్తూరు లక్ష్మి బైక్‌పై అంకాపూర్‌కు వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో 44వ జాతీయ రహదారిపై బ్రాహ్మణపల్లి ఎక్స్ రోడ్ వద్ద జక్రాన్‌పల్లి వైపు నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో భార్య లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందగా భర్త నర్సయ్య కాళ్లకు గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ఆస్పత్రిలోని పోస్టుమార్టం గదికి తరలించారు. మృతురాలి కొడుకు నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

## విద్యార్థుల్లో గణితంపై భయాన్ని పోగొట్టాలి




**అక్షరటుడే, కోటగిరి :** నేటి సమాజంలో విద్యార్థులకు గణితంపై భయాందోళన నెలకొందని ఆ భయాన్ని తొలగించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని కోటగిరి తహశీల్దార్ గంగాధర్ అన్నారు. మండల కేంద్రంలోని ఏఎస్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం హైదరాబాద్ ఎంటీఎస్ అబాకస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించారు. అబాకస్ వేదిక్ మ్యాథ్స్ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ.. ఎలాంటి పరికరాలు లేకుండా విద్యార్థులు గణితంలో ప్రతిభను చూపడం అభినందనీయమన్నారు. వేదిక్ మ్యథ్స్, అబాకస్ భవిష్యత్తులో విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో కోచింగ్ సెంటర్ నిర్వాహకులు వివేక్, శ్రీవేద హైస్కూల్ కరస్పాండెంట్ రవికుమార్, ప్రిన్సిపల్ అక్షర, ఉపాధ్యాయ బృందం, రేష్మ, నఫీజ్, చంద్రకళ, సాయి పవన్ పాల్గొన్నారు.

## యువకుడి దారుణ హత్య.. నలుగురు నిందితుల అరెస్ట్




**అక్షరటుడే, భీమ్‌గల్/బాల్కొండ:** మెండోరా మండలం పోచంపాడ్‌లో పాతకక్షలు, ఆర్థిక లావాదేవీలు ఒక యువకుడి నిండు ప్రాణాన్ని బలితీసుకున్నాయి. అనుమానం, డబ్బుల గొడవతో ఐదుగురు వ్యక్తులు కలిసి దండుగుల రిషిక్ అనే యువకుడిపై కత్తితో దాడి చేసి దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆర్మూర్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జాన్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. పోచంపాడ్ గ్రామానికి చెందిన వేముల నర్సింలుకు, దండుగుల రిషిక్‌కు మధ్య కొంతకాలంగా డబ్బుల వ్యవహారం, ఇతర వ్యక్తిగత కారణాలతో విభేదాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలోనే ఈనెల 6న రాత్రి 8 గంటల సమయంలో వీరి మధ్య మరోసారి ఘర్షణ చోటుచేసుకుంది. ఆవేశానికి గురైన వేముల నర్సింలు, తన కుమారులు ఉదయ్, కిషోర్‌తో పాటు కోట అరవింద్, అలకుంట చందులతో కలిసి రిషిక్‌పై కట్టెలు, కత్తితో దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో నర్సింలు కత్తితో రిషిక్ కడుపులో బలంగా పొడవడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆస్పత్రికి తరలించినప్పటికీ, చికిత్స పొందుతూ 7న తెల్లవారుజామున రిషిక్ మృతి చెందాడు. మెండోరా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందుతులు వేముల నర్సింలు, ఉదయ్ కిరణ్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారిచ్చిన సమాచారం మేరకు పరారీలో ఉన్న కోట అరవింద్, అలకుంట చందులను కూడా పట్టుకున్నారు. విచారణలో నిందితులు తమ నేరాన్ని అంగీకరించారు. నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు, శుక్రవారం కోర్టులో హాజరు పర్చారు. న్యాయస్థానం వారికి రిమాండ్ విధించడంతో నిందితులను జైలుకు తరలించినట్లు సీఐ జాన్ రెడ్డి తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదని ఆయన హెచ్చరించారు.

## రోడ్డుపై షెడ్డు నిర్మాణాన్ని నిలిపివేయాలని వినతి

**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలోని పాత బాన్సువాడ గూడెంగల్లిలో రోడ్డుపై శాశ్వత షెడ్డు నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం బాన్సువాడ మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానిక కౌన్సిలర్ రోడ్డుపైనే షెడ్డు నిర్మాణానికి సిద్ధమవుతున్నారని.. ఇదే జరిగితే రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే రోడ్డు పక్కన ఉన్న బోరును తొలగించడంతో పాటు పెద్ద చెట్లను నరికివేశారని వివరించారు. నిబంధనల ప్రకారం కేవలం 10శాతం స్థలంలో మాత్రమే నిర్మాణం చేయాల్సి ఉండగా, రోడ్డుకు అడ్డంగా షెడ్డు నిర్మించడం వల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొనడంతో పాటు అత్యవసర సేవలైన అంబులెన్స్, ఫైర్ సర్వీస్ వాహనాల రాకపోకలకు కూడా ఆటంకం కలుగుతుందని తెలిపారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రోడ్డుపై షెడ్డు నిర్మాణాన్ని వెంటనే నిలిపివేసి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.